కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 17, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 55, కాకర 32, బీర 45, క్యాబేజీ 21, ఫ్రెంచి బీన్స్ 55, క్యారెట్ 28, దొండ 23–30, చిక్కుడు 45, గోకర 28, బీట్‌రూట్ 23,క్యాప్సికం 60, ఆలు 33, దోస 16, సొర 11, పొట్ల 18, ఉల్లిగడ్డ 19, చామ గడ్డ 35. ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

నేడు మహాకాళి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డి నగర్ సోమగిరిలోని శ్రీ మనాథ క్షేత్రంలో ఆదివారం ఉదయం 8 గంటలకు మహాకాళి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ చైర్మన్ కౌశిక్ మహర్షి తెలిపారు. ఇందులో భాగంగా రెండు రోజులుగా మెళ్లూరి నవీన్ శర్మ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. ఆదివారం మండప పూజ, యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, శాంతి కల్యాణం, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అన్నప్రసాద వితరణ జరుగుతుందని ఆయన తెలిపారు.

ఇలా డంప్ చేస్తే ఎలా?

రోడ్ల పక్కన పేరుకుపోతున్న మట్టికుప్పలు, బిల్డింగ్ వ్యర్థాలు

- తరలింపుపై నిర్మాణదారుల నిర్లక్ష్యం
- రోడ్లు కుంచించుకుపోయి రాకపోకలకు అవస్థలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు


చైతన్యపురి డివిజన్‌లో రహదారుల పక్కనే ఉన్న మట్టికుప్పలు


న్యూ దిల్‌సుఖ్‌నగర్ కాలనీలో రోడ్డుపై డంప్ చేసిన బిల్డింగ్ వ్యర్థాలు


రహదారి పక్కన డంప్ చేసిన చెట్ల కొమ్మలు, మట్టికుప్ప

చైతన్యపురి: కాలనీల్లోని రహదారుల పక్కన మట్టి కుప్పలు, బిల్డింగ్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. చైతన్యపురి డివిజన్‌లో ఏ కాలనీలో చూసినా ఇదే పరిస్థితి ఉంది. ఇంటి పనులు చేయించుకుంటున్న వారు నిర్మాణ వ్యర్థాలను ఇంటి ముందే రోడ్డు పక్కనే డంప్ చేస్తున్నారు. నెలల తరబడి తొలగించకుండా వాటిని అలాగే వదిలేస్తుండటంతో ఆ మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

- రహదారుల వెడల్పు తక్కువ ఉండటం.. మట్టికుప్పల వల్ల రోడ్లు మరింత ఇరుకుగా మారి వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించటానికి అవస్థలు పడాల్సి వస్తోంది. వ్యర్థాలను డంప్ చేసిన వారు వాటిని తరలించకపోయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇలా రోడ్లపై నిర్మాణ వ్యర్థాలను డంప్ చేస్తే ఎలా అని, వాటిని తరలించకుండా నిర్లక్ష్యం చేసే వారికి అధికారులు భారీగా చలాన్లు విధించాలని స్థానికులు కోరుతున్నారు.
- వీటికి తోడు డ్రైనేజీ నాలాల నుంచి తీసిన పూడిక మట్టిని రోడ్లపైనే వేయడం వల్ల సమస్య తీవ్రమౌతోందని కాలనీల ప్రజలు వాపోతున్నారు.
- అలాగే విద్యుత్ శాఖ సిబ్బంది కూడా చెట్ల కొమ్మలను కొట్టి రోడ్ల పక్కనే కుప్పలుగా వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాలనీల్లో పర్యటించి వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీల వారు కోరుతున్నారు.

మల్కాజిగిరిలో బీజేపీని గెలిపించండి


శ్రీవెంకటరమణ కాలనీలో ప్రచారం చేస్తున్న ఈటల జమున

వనస్థలిపురం: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరుతూ అయన సతీమణి జమున శనివారం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని శ్రీ వెంకటరమణ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో నిర్వహించిన శ్రీ సీతారాముల వారి ఒడి బియ్యం వేడుకలో పాల్గొన్నారు. అనంతరం నాయకులతో కలిసి ప్రచారం చేస్తూ బీజేపీకి ఓటు వేయాలని కాలనీవాసులను అభ్యర్థించారు. కార్యక్రమంలో వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, బీజేపీ ఎల్‌బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, కాలనీ అధ్యక్షుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

‘అనయ’లో సందడిగా ఫుడ్ ఫెస్టివల్



హస్తినాపురం: హస్తినాపురంలోని అనయ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాత్రి ఫుడ్ ఫెస్టివల్ సందడిగా సాగింది. కళాశాలకు చెందిన వివిధ గ్రూపుల విద్యార్థులు వివిధ రకాల పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. తాము తయారు చేసిన ఆహార పదార్థాల గురించి విద్యార్థులు సందర్శకులకు వివరించారు. కళాశాల చైర్మన్ పోరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి ఉత్తమ స్టాల్స్‌ను ఎంపిక చేసి బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ బయ్యపురెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సైదిరెడ్డి, ఉపాధ్యాయులు హేమలత, రోజారాణి, అనిత, ఉష, మానస, కోటయ్య, శివలీల పాల్గొన్నారు.

ఉప్పరిగూడలో ఘనంగా అశ్వవాహన సేవ

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్ ఉప్పరిగూడ రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి అశ్వవాహన సేవ ఘనంగా నిర్వహించారు. ఉప్పరిగూడలోని వీధుల్లో స్వామివారిని అశ్వవాహనంపై ఊరేగించారు. స్థానిక మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి రథానికి మంగళ హారతులతో స్వాగతం పలికారు. సీతారామ నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. శ్రీ రామభక్త సమాజం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం కొనసాగింది. ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా మాదన్నపేట పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం..


హరిణ వనస్థలిలో వాకర్స్‌తో కలిసి వైద్యశిబిరంలో పాల్గొన్న మహేందర్‌రెడ్డి, మధుయాష్కీ

మన్సూరాబాద్: 118 జీఓ కింద ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ హామీ ఇచ్చారు. మన్సూరాబాద్ జీఎస్‌ఐ రోడ్డులోని హరిణ వనస్థలి పార్కులో శనివారం మార్నింగ్ వాకర్స్‌ను కలిసి వాకింగ్ చేసి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 118 జీఓ కింద ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ ప్రక్రియ అస్తవ్యస్తంగా జరిగిందని, సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ప్రగ్నా హాస్పిటల్స్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో రోడ్డు డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, నేతలు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, ముద్దగౌని రాంమ్మోహన్‌గౌడ్, గజ్జి భాస్కర్ యాదవ్, వెంకటేష్‌యాదవ్, వజీర్ ప్రకాష్‌గౌడ్, ఎస్వీ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు ఆర్యవైశ్య సంఘం నాయకుల ధన్యవాదాలు


రేవంత్‌రెడ్డిని సత్కరిస్తున్న రమాకాంత్ గుప్తా

చంపాపేట: రాష్ట్రంలోని ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు శనివారం కర్మన్‌ఘాట్ ఆర్యవైశ్య సంఘ నాయకులు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఆకుల రమాకాంత్ గుప్తా ఆధ్వర్యంలో శనివారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల శ్రవణ్‌కుమార్ గుప్తా, ఆరాధన ఫౌండేషన్ చైర్మన్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

చంపాపేట: కాలనీలోని ప్రధాన రహదారిని కొంతమేర ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని సర్కిల్ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కూల్చివేశారు. చంపాపేట డివిజన్ దుర్గాభవానీనగర్‌లో ఈ ఘటన శనివారం జరిగింది. వివరాలు.. కాలనీలోని విద్యాదాయిని ఉన్నత పాఠశాల నిర్వాహకులు తమ ప్రహరీని ఆనుకుని ఉన్న కాలనీ ప్రధాన రహదారిని కొంతమేర ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపట్టారు. విషయం తెలుసుకున్న కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు రమేష్ రెడ్డి పనులను నిలిపి వేయాలని పాఠశాల నిర్వాహకులను కోరగా, నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీంతో ఆయన ఎల్‌బీనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది హుటాహుటిన కాలనీకి చేరి నిర్మాణాన్ని కూల్చివేశారు. కాలనీ సంక్షేమ సంఘ కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని జయప్రదం చేయాలి

చైతన్యపురి: వీర హనుమాన్ విజయ యాత్ర బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని వీహెచ్‌పీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావినూతల శశిధర్ అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లో శనివారం జరిగిన ర్యాలీ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం ఉదయం 7.30 గంటలకు కర్మన్‌ఘాట్ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని చెప్పారు. అక్కడ నుంచి సంతోష్‌నగర్, సరూర్‌నగర్, చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్ మీదుగా చాదర్‌ఘాట్ వరకు ర్యాలీ కొనసాగి.. అక్కడ ప్రధాన ర్యాలీలో కలుస్తుందన్నారు. ర్యాలీలో పెద్దసంఖ్యలో యువత పాల్గొని హనుమంతుడు, సీతారామచంద్రస్వామి ఆశీస్సులు పొందాలని కోరారు. సమావేశంలో వీహెచ్‌పీ నాయకులు మహేష్, బ్రహ్మచారి, నవీన్‌కుమార్, నిఖిల్ సింగ్, రాంరెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉప్పల ఫౌండేషన్

నాగోలు: పేదింటి ఆడపిల్లలకు ఉప్పల ఫౌండేషన్ అండగా నిలుస్తోందని అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. మొయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన కె.నందిని, ప్రశాంతి, పి.నందిని అనే ముగ్గురు పేద యువతుల వివాహం నేపథ్యంలో శనివారం వారికి ఉప్పల ఫౌండేషన్ ద్వారా బంగారు పుస్తె, మెట్టెలను శ్రీనివాస్ గుప్తా అందజేశారు. ఐవీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్, మేడిపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు రాములు, అమ్మాయిల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మజ్లిస్ ఆగడాలను అడ్డుకుంటాం

బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీలత


ప్రచారం నిర్వహిస్తున్న మాధవీలత, కార్పొరేటర్ శ్వేతా మధుకర్‌రెడ్డి

సైదాబాద్: హైదరాబాద్ ఎంపీ స్థానం గెలిచి పాతబస్తీలో మజ్లిస్ ఆగడాలను అడ్డుకుంటామని బీజేపీ అభ్యర్థి మాధవీలత అన్నారు. శనివారం సాయంత్రం ఆమె ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, పార్టీ నాయకులతో కలిసి డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాదయాత్ర ద్వారా కాలనీలలోని ఇంటింటికి వెళ్లి పార్టీ ఎన్నికల కరపత్రాలు పంచుతూ బీజేపీకి ఓటు వేసి తనను గెలిపించాలని ఆమె అభ్యర్థించారు. ప్రచారంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవతోనే సమాజంలో గుర్తింపు


మాట్లాడుతున్న గోవర్ధన్ యాదవ్

చంపాపేట: నిస్వార్థం, నిబద్ధతతో సేవలు చేసే ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనంతరం కూడా సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని రాష్ట్ర పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ యాదవ్ అన్నారు. కర్మన్‌ఘాట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న వాణీ కన్యాకుమారి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా గోవర్ధన్ యాదవ్ మాట్లాడుతూ...కన్యాకుమారి తన సర్వీసులో ప్రతిభ గల పేద విద్యార్థులకు చేయూత అందించి వెన్నుతట్టి ప్రోత్సహించటమే కాకుండా పలు పాఠశాలల్లో తన సొంత ఖర్చుతో తరగతి గదులకు మరమ్మతులు, తాగునీటి సదుపాయం కల్పించారని గుర్తు చేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ఆమెను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వెంకట నర్సింహారెడ్డి, ఉపాధ్యాయ నేతలు మహేందర్‌రెడ్డి, నవీన్, రాఘవేందర్, విజయ్‌సేనారెడ్డి, నర్సింహారెడ్డి, నర్సింహులు, సునీత తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు చేపట్టాలి: కొప్పుల

మన్సూరాబాద్: మన్సూరాబాద్ గ్రామ సర్వే నంబర్– 05లోని ప్రభుత్వ స్థలంలో 200 గజాల స్థలాన్ని ఓ మహిళా కబ్జా చేసి ఇంటిని నిర్మించిందని, ఈ నిర్మాణంపై చర్యలు చేపట్టాలని కోరుతూ భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్‌కు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మన్సూరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. ఆరు నెలలుగా ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపడుతున్నారని, ఇదే విషయాన్ని సరూర్‌నగర్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా స్పందించకపోగా, కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. మన్సూరాబాద్ గ్రామంలోని ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మించిన నిర్మాణాన్ని కూల్చివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

స్పెషల్ పీపీకి సన్మానం

రంగారెడ్డి కోర్టులు: రాచకొండ కమిషనరేట్ పరిధిలో శనివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టు పీపీ సునీతా బర్లను రాచకొండ పోలీసు కమిషనర్ తరుణ్ జోషి సన్మానించారు. 2023వ సంవత్సరంలో అత్యధికంగా 13 మంది నిందితులకు జైలు శిక్ష పడేలా కృషి చేసినందుకు పీపీని కమిషనర్ అభినందించి సత్కరించారు.

అగ్నిప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

- మల్కాజిగిరి డివిజన్ ఫైర్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు


కామినేని ఆసుపత్రిలో అగ్నిప్రమాదాలపై డ్రిల్ నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది

మన్సూరాబాద్: వేసవిలో తరచూ అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయని, ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకుంటే వాటిని నివారించవచ్చని మల్కాజిగిరి డివిజన్ ఫైర్ ఆఫీసర్ నాగేశ్వర్ రావు అన్నారు. ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్‌లోని ఇందిరా ఆడిటోరియంలో శనివారం అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, ప్రతి ఏటా ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా పెట్రోల్ బంకులు, ఆసుపత్రులు, గోదాములు, పాఠశాలలు, ఫంక్షన్ హాళ్లలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించామన్నారు. అగ్నిప్రమాదాలపై అప్రమత్తగా ఉండాలని, లేనిపక్షంలో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. అనంతరం కామినేని హాస్పిటల్ సిబ్బందికి అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్లు రంజిత్ రెడ్డి, వెంకటేష్, ఎల్‌బీనగర్, చర్లపల్లి, మల్కాజిగిరి ఫైర్ ఆఫీసర్లు యాదగిరి, శేఖర్‌రెడ్డి, మల్లేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

వంట గ్యాస్ సిలిండర్ ప్రమాదాలపై ..

వనస్థలిపురం: ఫైర్ సేఫ్టీ వారోత్సవాల్లో భాగంగా వనస్థలిపురం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హయత్‌నగర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది వంట గ్యాస్ సిలిండర్ అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఫైర్ ఆఫీసర్ యాదగిరి మాట్లాడుతూ, కనీస జాగ్రత్తలు పాటిస్తే అగ్ని ప్రమాదాల వల్ల జరిగే భారీ నష్టాలను అధిగమించవచ్చని అన్నారు. గ్యాస్ సిలిండర్ మండినప్పుడు, గ్యాస్ లీకైన సందర్భాలలో కంగారు పడకుండా మంటలను ఎలా ఆర్పాలో, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో లైవ్ డెమో ద్వారా చూపించారు. మంటల స్థాయిని బట్టి 101కి ఫోన్ చేయడం, ఫైర్ ఇంజిన్ వచ్చేలోగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో భావన శ్రీనివాస్, చంద్రమౌళి గుప్తా, అల్లాడి పరమేశ్వర్, నంబూరి తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

నటన, స్క్రిప్ట్ రైటింగ్‌లో ఉచిత శిక్షణ

మలక్‌పేట: ఫోర్త్ వాల్ థియేటర్ సంస్థ ఆధ్వర్యంలో యువతీ, యువకులకు నటనలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకుడు, ఫిల్మ్ డైరెక్టర్ నల్ల అమరేందర్ తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్ శాలివాహన నగర్‌లోని కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నటన, దర్శకత్వం, స్క్రిప్ట్ రైటింగ్, యాకరింగ్‌పై ఆసక్తి గల వారికి సినీ రంగంలో అనుభవజ్ఞులైన వారిచే నెల రోజుల పాటు శిక్షణ ఇప్పిస్తామన్నారు. 15 నుంచి 50 ఏళ్ల వయసు కలిగిన వారు ఆధార్ కార్డు, రెండు ఫోటోలతో మే 5 తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్ నం. 73064 75283 నంబర్లలో సంప్రదించవచ్చు.

దాతల సహకారంతో భక్తులకు మరిన్ని సదుపాయాలు


దాతలు కిషోర్, రవీందర్‌లను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్ రఘుమారెడ్డి

చంపాపేట: దాతలు, భక్తుల సహాయ సహకారాలతో కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయానికి వచ్చే భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి అన్నారు. శనివారం చంపాపేటకు చెందిన కిషోర్, రవీందర్ సంయుక్త ఆధ్వర్యంలో స్వామివారి ఆలయంలో అన్న వితరణ కోసం లక్ష రూపాయలు విరాళంగా రఘుమారెడ్డి సమక్షంలో అందజేశారు. అనంతరం వారిని ఆలయ పాలక మండలి సభ్యులు ఘనంగా సన్మానించగా, ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. కార్యక్రమంలో అర్చకులు అంబ ప్రసాద్, ప్రవీణ్ శర్మ, పీఠాంబరాచార్యులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్ఓ పరీక్షలో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



లక్డీకాపూల్: టీచర్లు, విద్యార్థుల ఉమ్మడి కృషి ఉంటే ఎలాంటి పరీక్షలనైనా విజయవంతంగా ఎదుర్కోవచ్చని గడ్డిఅన్నారం శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ సాయి గీత అన్నారు. శనివారం 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఐఎన్‌టీఎస్ఓ (ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్) పరీక్ష నిర్వహించారు. సెకండ్ లెవెల్ పరీక్షలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఆమె అభినందించారు. వరుసగా ఐదు స్థానాలను దక్కించుకున్న విజేతలు బంగారు పతకాలు అందుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం సతీష్, ఆర్ఐ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



మన్సూరాబాద్: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కుకుట్లపల్లి జగదీష్ శనివారం టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జగదీష్ మన్సూరాబాద్‌లో మాట్లాడుతూ.. మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునిత మహేందర్‌రెడ్డి విజయానికి కృషి చేస్తానని తెలిపారు.

సరూర్‌నగర్‌లో ఫ్లాగ్ మార్చ్



చైతన్యపురి: వచ్చే పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో సరూర్‌నగర్ పోలీసులు భగత్‌సింగ్‌నగర్ కాలనీలో శనివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎల్‌బీనగర్ ఏసీపీ అమరగాని కృష్ణయ్య మార్చ్‌లో పాల్గొని స్థానికులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చూడాలన్నారు. శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, ఎస్ఐలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.





అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

సైదాబాద్: రాత్రి వేళల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ కథనం ప్రకారం.. చింతల్‌బస్తీలో నివసించే కె.సునీత తన ఇంటి వద్ద అక్రమంగా పలు రకాల మద్యం సీసాలు నిల్వ ఉంచుకొని మద్యం దుకాణాలు మూసివేసిన తర్వాత వాటిని ఎక్కువ ధరకు విక్రయిస్తోంది. సమాచారం అందుకున్న సైదాబాద్ పోలీసులు శుక్రవారం రాత్రి దాడి చేసి మద్యం విక్రయిస్తున్న సునీతను అదుపులోకి తీసుకొని వివిధ బ్రాండ్లకు చెందిన 33.58 లీటర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పట్టాలు పొందిన విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి

గ్రాడ్యుయేషన్ డే

సైదాబాద్: చిన్నారులు ఇష్టంగా విద్యను అభ్యసించేలా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించాలని శ్రీత్రివేణి ఉన్నత పాఠశాల డైరెక్టర్ జి.గోవర్ధన్‌రెడ్డి సూచించారు. చంపాపేటలోని పాఠశాలలో కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రీ ప్రైమరీ విద్య పూర్తి చేసుకొని ప్రైమరీ తరగతులకు వెలుతున్న విద్యార్థులకు ఆయనే అర్హత పట్టాలు అందజేశారు. చిన్నారులు స్నాతకోత్సవ సంప్రదాయ దుస్తులు, టోపీలు ధరించి పట్టాలు చూపుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అతిథులుగా డాక్టర్ హేమా ఠాగూర్, కల్యాణ్‌వర్మ, ప్రిన్సిపాల్ శారద, కోఆర్డినేటర్ మాధురి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.